# బంధుప్రీతీ బహుపరాక్!

**ఆత్మస్తుతి** అనుకుంటే అనుకోండి కానీ, నా సంసార జీవితం సుఖవంతమైనదని చెప్పుకోవటానికి నేను గర్విస్తాను.

మావారు అందంగా ఉంటారు. నెమ్మదస్థులు. మితభాషి. పవర్‌తో పాటు మంచి పలుకుబడి ఉన్న పెద్ద ఉద్యోగంలో ఉన్నారు ఢిల్లీలో. పైపెచ్చు మగ పేరుతోనే మంచి రచయితగా పేరు తెచ్చుకున్నారు. ఢిల్లీలో జరిగే సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలలో ముఖ్యులు.

బయట 'అంత' గొప్పవారైనా, నా ఇంటి నాలుగు గోడల మధ్య, నా దగ్గర, ఆయన చిన్న పిల్లాడైపోతారు. గారాబాలు పోతుంటారు.

స్నానం చేస్తుంటే ఒళ్ళురుద్దాలి. తువాలు అందించాలి. తలకి నూనె రాయాలి. ఏ రోజు ఏ బట్టలు వేసుకోవాలో నేనే సెలెక్ట్ చేయాలి. ఆయనకి ఏది ఇష్టమో చూచి నేనే వండాలి. ఏం వండినా కిమ్మనకుండా తింటారు. నాకే బాగా లేని వంటకాలని కూడా ఆయన ఎన్నడూ ఆక్షేపణ చేసి ఎరుగరు.

'ఎంతో అదృష్టం చేసుకుంటేనే కాని వెంకటరమణమూర్తి లాంటి మొగుడు అందరికీ దొరకడు. శైలజ పెట్టి పుట్టింది. గొప్ప అదృష్టవంతురాలు.'

అలా అందరూ అంటుంటే నా మనసు పొంగిపోతుంది. నేను మరో బారెడు ఎదిగినట్లు ఫీలవుతాను.

'నోములే నోచానో, యజ్ఞయాగాలే చేశానో కానీ, శైలూ, నువ్వు నా భార్య కావటం నా అదృష్టాలలోకల్లా అదృష్టం. నా ఉద్యోగం ప్లస్ పేరు ప్రఖ్యాతులు ఒక ఎత్తు; నువ్వొక్కతివీ ఒక ఎత్తు. నఃవ్వు నా గుండెవి శైలూ, ఊపిరివి, నా వృద్ధికి పునాదివి. నువ్వు లేని నేను లేనేలేను. అద్వైతస్థితి ఇదే, మైడియర్ శైలూ.'

ఎప్పుడైనా మూడ్ వచ్చి మాట్లాడటం ప్రారంభిస్తే ఆయన ధోరణి అలా సాగుతుంది. నిజంగా అలాంటి రోజు నాకు పండగ రోజు. స్వర్గాధిపత్యాన్ని పొందిన అనుభూతి...ఒక ముద్ద అన్నాన్ని, ఒక గ్లాసుడు నీళ్ళను స్వీకరించే శక్తి లేకుండా శరీరం ఏదో లోకాల్లోకి తేలిపోతుంది. మనసంతా మల్లెల వాసనతో గుబాళించి పోతుంది.

సో వెంకటరమణమూర్తి ది గ్రేట్ ఈజ్‌మై షేడో. నా కొంగున గట్టేసుకున్న తాళాలగుత్తి. జాకెట్‌లో దోపేసుకున్న మనీపర్స్. సిగలో తురిమేసుకున్న మల్లెల మాల.

అయితే, ఒక్క విషయంలో మాత్రం అతను నాకు కొరకరాని కొయ్య అయ్యారు. కాపరానికి వచ్చినది లగాయితూ ఆ విషయంలో అతడిని నా దారికి మళ్ళించుకోవాలని చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి.

నాకు పుట్టింటి వైపున పెద్ద బలగం ఉంది. ఆంధ్రదేశంలో ఏ రూట్‌న వెళ్ళినా బంధువులు తగులుతారు. వెంకటరమణమూర్తికీ బంధువులున్నారు కాని, అతను వాళ్ళని గురించి పట్టించుకోడు. వాళ్ళు అతనితో అవసరాలుంటే తీర్చుకోటానికి నేరుగా ఢిల్లీకే వస్తుంటారు. ప్రేమాభిమానాలు లేని రాతి మనుషులు వారంతా.

కానీ, మా బంధువుల విషయం అలా కాదు. మా అంత కాకపోయినా కాస్తో కూస్తో అంతా పొజిషన్స్‌లో ఉన్నవారు. చిన్నప్పటి నుంచి నేనంటే అందరికీ అభిమానం. ఢిల్లీ వెళ్ళిన దగ్గర నుంచీ ఒకటే ఉత్తరాలు రాయటం-ఆ ఉత్తరాల్లో సారాంశం ఒక్కటే. మమ్మల్ని తమ ఇళ్లకు వచ్చి నెల రోజులు సరదాగా గడపమని.

నిజం చెప్పద్దూ? నాకూ అలాంటి సర్దాలు ఉన్నాయి. పైగా నాకు కావలిసిన బంధువర్గం ముందు నా భర్త గొప్పను, నా ఘనతను ప్రదర్శించుకోవాలన్న కోరిక బలంగానే ఉంది.

పది మంది బంధువుల ఇంట వాళ్ళు కోరిన విధంగా నెల చొప్పున ఉంటే పది నెలలవు తుంది. అదెలాగూ సాధ్యపడే విషయం కాదు.

అందుచేత నెల సెలవు పెట్టించి అతి ముఖ్యబంధువుల ఇంట కొద్ది కొద్ది రోజులు ఉండే చొప్పున కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాను. కానీ, ఆ నెల సెలవుకీ ఆయన అంగీకరిస్తేనా? ఒకసారి సెలువు సాకు మరో సారి నాటకాల సాకు ఇంకోసారి కాన్ఫరెన్సుసాకు. సంవత్సరాలు వెళ్ళగొట్టేశారు.

మొదట్లో ఆయన సాకుల్ని నమ్మాను. ఆయన మాటలు సాకులని తెలిశాక కోపం వచ్చి నిలేశాను.

"నీకు తెలీదు, శైలూ. నువ్వొట్టి అమాయకురాలివి. బంధువుల ఇళ్ళకు వెళ్ళకుండా ఢిల్లీలో దూరంగా ఉన్నంతసేపే మనపట్ల మర్యాద ఉంటుంది. వెళ్ళాం పో. వెళ్ళిన రోజు బాగా ఉంటుంది. రెండో రోజు రోత పుడుతుంది. మూడో రోజు మురికి పడుతుంది. నాలుగో రోజు పోట్లాట. అయిదో రోజు ఉద్వాసన. పైగా రైల్లో, బస్సుల్లో ప్రయాణాలు. బయలుదేరిందాకా సరదాగా ఉంటుంది కాని, రైలు స్టేషనుకు వెళ్ళిన మరుక్షణం నుంచి మొదలవుతాయి మన బాధలు. ఎందుకొచ్చిన కష్టాలు చెప్పు? పురుళ్ళు, పుణ్యాలు, పెళ్ళిళ్ళు అయితే ఎలాగూ తప్పదనుకో.'

అబ్బ! పైకి మెత్తగా, మృదువుగా కనిపించే ఈ మనిషి కడుపులో ఎంతటి విషపు ఆలోచన ఉంది. మొట్టమొదటిసారి ఆయన పట్ల అసహ్యం కలిగింది. కోపం వచ్చింది.

'అంటే మా వాళ్ళు మనం నాలుగు రోజులుంటే మర్యాద చేయని వాళ్ళనేనా మీ ఉద్దేశ్యం? మీ పుట్టింటి సంచులాగా అందరూ రాతి మనుష్యులు అనుకోకండి. మా వాళ్ళకు నేనంటే చిన్నప్పటి నుంచి అభిమానం-ప్రేమ. నన్ను చూచి ఆహ్వానిస్తున్నారు కాని, మీ హోదాని, గొప్పతనాన్ని చూచి ఆహ్వానించలేదు. అయిదు రోజులు కాదు ఒక్కొక్కరి ఇంట్లో అయిదేళ్ళున్నా ఆనందించే బంధు ప్రేమలున్నవారు మా వాళ్ళు. అయినా ఇంతటి దుర్మార్గపు ఆలోచన కడుపులో ఉంచుకుని ఇన్నాళ్ళు ఎందుకంత కమ్మగా అబద్ధాలాడారు? మీరింత తేనె పూసిన కత్తి అనుకోలేదు సుమండీ.'

ఆయన తన ధోరణికి నన్ను తీసుకెళ్ళాలని రచయితగా, నటుడిగా, పెద్ద ఆఫీసర్‌గా ఉన్న అనుభవాన్నంతా రంగరించి నా మీద ప్రయోగించారు. ఆఖరికి పిండితసారాన్ని ఇలా తేల్చేశాడు.

'నీ బంధువులు, నా బంధువుల విషయం కాదు, శైలూ, నేను చెప్పింది. అసలు మానవ ధర్మాలు, మనోధర్మాలు కుటుంబధర్మాలు ఇవి. ఈ ధర్మాలకి బీదరికం భాగ్యం ప్రసక్తులు లేవు. కుల, మత విచక్షణలు లేవు. సర్వ కాలాలకు వర్తించే లోకధర్మం ఇది. ''

నాన్సెన్స్! బంధుత్వాలను, ఆప్యాయతలను, అనురాగాలను ఎంత తేలిగ్గా తోసిపారేసే సిద్ధాంతం ఇది? పది రోజులు బంధువులకు తిండి పెట్టి మర్యాద చేయని స్థితిలో మనుష్యుల్ని తీసేయటం ఏం ధర్మం?

'ఇది మీ సంకుచిత ధోరణికి నిదర్శనం. మీ పుర్రెలో పుట్టిన ఒక భ్రష్టపు ఆలోచనను సిద్ధాంతంగా చిత్రించి లోకధర్మాన్ని చేసే ప్రయత్నం మానండి.''

మొత్తం మీద అతడి ఆలోచనా ధోరణి తెలిశాక నాలో పట్టుదల ఎక్కువయింది. భార్య భర్తను లొంగదీసుకోటానికి ఉపయోగించాల్సిన అన్ని మంత్రాలను ఉపయోగించాను. కొరకరాని కొయ్యలాంటి మనిషిని గుజ్జు చేశాను. చివరికి విజయాన్ని సాధించాను.

'ఆల్‌రైట్ శైలూ' నెల కాదు, రెండు నెలలు పూర్తిగా నీ 'డిస్పోజల్'లో ఉంటాను. పోయిన బంధువుల ఇళ్ళలోకాని, మార్గం మధ్యలోకాని, ప్రయాణంలోకాని, మంచి వచ్చినా శబ్బర వచ్చినా, సుఖ మొచ్చినా, కష్టమొచ్చినా నేనేం మాట్లాడను. నువ్వెలా నడవమంటే అలా నడుస్తాను.'

★ ★ ★

మా పర్యటన కార్యక్రమంలో ప్రతి అంశాన్ని లెక్కకు తీసుకుని, పూర్వాపరాలు తీవ్రంగా ఆలోచించి, మొత్తం పర్యటన కార్యక్రమం యొక్క 'బ్లూప్రింట్'ను రూపొందించటానికి నాకు మూడు నెలలు పట్టింది.

వెరీగుడ్, శైలూ, నువ్వు ప్రధానమంత్రి పి.ఎ.గా ఉండాల్సిన దానివి. ప్రొసీడ్ విత్ యువర్ ప్లాన్. విష్ యు ఆల్ సక్సెస్,' బ్లూ ప్రింట్ చూచాక అభినందించి ఆశీర్వదించకుండా ఉండలేక పోయాడు వెంకటరమణమూర్తి.

మొత్తం మా పర్యటన కాలం ఒకటిన్నర నెలకు పైన అయిదు రోజులు. అందులో రైలు, బస్సు ప్రయాణాల్లో దరిదాపు పది రోజులకాలం హరించుకుపోతుంది. మిగిలింది బంధువుల ఇళ్ళలో గడపాలి.

బ్లూప్రింట్ ప్రకారం మొదటి మజిలీ హైదరాబాద్. అక్కడ చుట్టాలూ పక్కాలతో పాటు నా ముఖ్య స్నేహితురాళ్ళు కూడా ఉన్నారు. అందరూ ఎన్నాళ్ళుగానో రమ్మని ఉత్తరాలు రాస్తున్నవారే. రాలేదని నిష్ఠూరాల చురకలు మధ్య మధ్య అంటిస్తున్నవారే.

ఇంత మందిలో ఎవరింటికి ముందుగా వెళ్ళాలన్నది పెద్ద సమస్య అయింది. అందరూ నా రాకకోసం ఎన్నాళ్ళుగానో నిరీక్షిస్తున్నవారే. నేను వెళ్ళితే పరమానంద భరితులయ్యేవారే.

నేనైతే హోటల్లో దిగుతాను. ఇప్పుడంతా నీకొదిలేశాను కనక నువ్వెక్కడికి రమ్మంటే అక్కడికొస్తాను- 'సలహా' అడిగితే వెంకటరమణమూర్తిగారి సమాధానం అది.

చివరికి మా పెద్ద అక్కయ్య ఇంటికి వెళ్ళాలని, హైదరాబాద్‌లో ఉన్న పదిహేను రోజులూ వారింటినే కేంద్రంగా చేసుకుని మిగతా బంధువులు, స్నేహితుల ఇళ్ళు విజిట్ చేసి ఆతిథ్యాలు స్వీకరించాలని నిర్ణయించాను.

'అదేం పాపం! ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాబాయిని, డిప్యూటీ సెక్రటరీ అన్నయ్యని, ఇంకా గొప్ప గొప్ప బంధువుల్ని, స్నేహితురాళ్ళని వదిలేసి పాపం-పెద్ద సంసారంతో, చాలీచాలని జీతంతో బాధపడే అక్కయ్య ఇంటి మీద పడ్డావ్? సోషలిజమా?'

నవ్వుతూనే పొడిచాడు వెంకటరమణమూర్తి. కాని, నా ఆలోచన అతడికేం తెలుస్తుంది?

మా పెద్దక్కయ్యకు చిన్ననాటి నుంచి నేనంటే అమిత ప్రేమ. పెళ్ళప్పుడు మా పెద్ద బావ నన్ను ఆటలు పట్టిస్తే, నేను అంతకు రెండింతలు అతడిని ఆటలు పట్టించాను.

అప్పట్లో మా పెద్దబావ మంచి తెలివిగల వాడని పేరు. ఎమ్.ఎస్.సి. చదువుతుండేవాడు. అతని చదువు, తెలివితేటలు, అందచందాలు చూసి, ఆస్తిపాస్తులు లేకపోయినా మా నాన్న అతడిని పెద్దల్లుడుగా ఎంచుకున్నాడు.

అదేం కర్మో? మానాన్నతో సహా చాలామంది ఎంత ప్రయత్నించినా అతనికి నచ్చిన ఉద్యోగాలు దొరకలేదు. దొరికిన ఉద్యోగాలను అప్పట్లో అతను త్రోసిపుచ్చాడు.

చివరికి సెక్రటేరియట్‌లో యు.డి.సి. ఉద్యోగంలో చేరక తప్పింది కాదు. ఉద్యోగంలో చేరిన దగ్గర నుంచి మాబావ మానసికంగా, శారీరకంగా కూడా క్రుంగిపోయాడు. పైగా నా పెళ్ళినాటికే మా అక్కకు ముగ్గురు పిల్లలు!

మా బంధువర్గంలో ఆర్థికంగానూ, ఉద్యోగపరంగానూ ఎక్కిరానిది మా బావ ఒక్కడే. అప్పుడెప్పుడో సెక్షన్ ఆఫీసర్ అయ్యాట్ట. ఈ మధ్య అసిస్టెంటు సెక్రటరీగా ప్రమోషన్ వచ్చినట్లు తెలిసింది.

మా అక్కయ్య ఎప్పుడూ ఇంటి విషయాలు దాయదు. నన్ను, మా ఆయన్ని పొగుడుతుంది. సినిమాలను గురించి, తెలుగు నవలల్ని గురించి ఉత్తరాల్లో రాస్తూ ఉంటుంది.

అందుకే అదంటే నాకు ప్రేమ. అదో విధమైన జాలి. వెళ్తే సంతోషిస్తుందని నా నమ్మకం. అన్నయ్య, బాబాయిలు ఉన్నా వారి విషయం వేరు. అన్నయ్యతో పాటు మా వదినా ఏదో ఉద్యోగం చేస్తూంది. బాబాయి భార్య పరమ గయ్యాళి.

ప్రయాణం యావత్తుకూ అవసరమైన రైలు రిజర్వేషన్‌లు అయిపోయాయి. అప్పుడు అందరికీ ఉత్తరాలు రాశాను. మా అక్కయ్యకు ప్రత్యేకించి పెద్ద ఉత్తరం రాశాను.

మా అక్కయ్య ఆర్థికంగా మాల్లో తక్కువస్థాయిదైనా, అభిమానంలో ఎవరికీ తీసిపోయింది కాదు.

మేము ఉన్న రోజులకు ఖర్చులకుగాను డబ్బిస్తే బాగుండదు. అందుకని మా అక్కయ్యకు పట్టుచీరె, మా బావగారికి, పిల్లలకు మంచి బట్టలు, మరెన్నో బహుమానాలు కొన్నాను. ప్రత్యేకించి మా అక్కయ్యకు గ్రైండర్ కమ్ మిక్సర్ ఒకటి కొన్నాను. అలాగే మిగతా బంధువులకి కూడా తగు బహుమానాలు తయారు చేసుకున్నాను.

వీటితో పాటు మాకు ప్రయాణంలో కావాలసిన వస్తువులతో రైలులో మా కంపార్టుమెంటంతా నిండిపోయింది. కండక్టరు మావారి డిసిగ్నేషన్ చూచో లేక నామొహంచూచో మాట్లాడకుండా వూరుకున్నాడు.

సముద్రగుప్తుడి దక్షిణదేశ దిగ్విజయయాత్రలాగా మా బంధువర్గ సందర్శనాయాత్ర ప్రారంభమయింది.

★ ★ ★

నన్ను రిసీవ్ చేసుకోవటానికొచ్చిన బంధువులతో స్టేషన్ క్రిక్కిరిసి ఉంటుందనుకున్నాను. స్టేషన్ క్రిక్కిరిసే ఉంది. అయితే, అందులో నన్ను రిసీవ్ చేసుకోవటానికొచ్చింది మా అన్నయ్య మాత్రమే.

'బాగున్నావా, శైలూ. అక్కయ్య ఇంట మకాం పెడతానని రాశావేంటి? ఏం? అన్నయ్య ఇల్లు బాగుండదనా?'

నా కళ్ళు అక్కయ్య కోసం వెతుకుతున్నాయి. బుర్రలో ఆలోచనలు ఒక క్షణం స్తంభించిపోయాయి.

'హలో, బావగారూ. చాలా కాలానికి తీరిక చేసుకుని మమ్మల్ని కటాక్షించారు. ఎలాగైనా ఢిల్లీ ఆఫీసర్లు. పైగా కీలకస్థానంలో ఉన్నారు. అవును కానీ, సార్...మాకేవో ట్రాన్స్ఫర్లు వస్తాయంటున్నారు. నిజమేనా, బావగారూ. మీకు పుణ్యం ఉంటుంది కాని, నన్ను మన స్టేట్‌లోనే ఉంచేలా చూద్దురూ.'

వెంకటరమణమూర్తి నావైపు 'చూచావా?' అన్నట్టు చూచాడు.

'నీకు తెలీదు, శైలూ. నేనిప్పుడున్నది చాలా కీలకమైన పొజిషన్‌లో. అటు రాజకీయంగానూ, ఇటు ఉద్యోగపరంగానూ నా నుంచి ఏదో ఇన్ఫర్మేషన్ రాబట్టటానికి మన వాళ్ళు ప్రశ్నలేస్తారనుకో. నేను జవాబివ్వకపోతే నువ్వు కష్టపడకూడదు.'

'గొప్ప! నాపట్ల ప్రేమ చూపుతున్నది మీ నుంచి లాభాలు పొందడానికనా మీ ఉద్దేశ్యం? మా వాళ్ళంత నీచబుద్ధికలవారు కాదు. భయపడకండి.'

'సంతోషం. కానీ నేను అంటున్నది అలా జరిగినప్పటి విషయం. జరగకపోతే తిరిగొచ్చాక నాకుత్సిత బుద్ధిని కడిగేయి. శిరసావహిస్తాను.'

'అలా జరిగితే నేనే మా వాళ్ళకు తగు విధంగా బుద్ధి చెప్పుతాలెండి. మీరేం చేసినా మిమ్మల్నే సపోర్టు చేస్తాను. సరేనా?'

బయలుదేరే ముందు మాకు జరిగిన ఒప్పందం అది.

'అన్నయ్యా! రైలు దిగగానే ఆఫీసు విషయాలా? నీకు పుణ్యముంటుంది కాని, ముందు మమ్మల్ని

అక్కయ్య ఇంటికి చేరవేద్దూ?' బాగా చిరాకుగానే వచ్చాయి నా నోటి నుంచి మాటలు.

'ఓ! అయాం సారీ!' అన్నయ్య ఒకసారి మావైపు, మాసామాను వైపు చూచి రిస్ట్‌వాచ్ చూచుకున్నాడు.

'ఇవాళ కేబినెట్ మీటింగు ఉంది, బావగారూ. చీఫ్‌మినిస్టరుగారు కబురు చేశారు. వెళ్ళాలి. లేకపోతే మీవెంట వచ్చేవాడిని. టాక్సీ వాడితో అన్నీ చెబుతాను. ముందు బయటికి పదండి.'

పోర్టర్లు సామాను బయటికి చేరవేస్తుండగా, బాబాయి, బిళ్ళ బంట్రోతు వెంటరాగా హడావుడిగా వచ్చాడు.

'ఆలస్యమయిపోయిందమ్మా. బాగున్నారా అంతా? సరిగ్గా ఇవాళే కాంప్‌కెళ్ళాల్సి వచ్చింది. బయలుదేరి వెళ్ళుతూ మిమ్మల్ని చూచి ముఖ్యవిషయాలు మాట్లాడిపోదామని వచ్చాను. బయట జీప్‌లో నా స్టాఫ్ ఉంది. అవునుకానీ, కమల ఇంటికి వెళ్ళుతున్నానని రాశావేమిటమ్మాయ్. దాని ఇంట్లో ఒక ఫోనా? ఎయిర్‌కూలరా? కారా? అల్లుడు పెద్ద ఆఫీసరు. ఆ ఇరుకు ఇంట్లో ఏం బాధపడతాడు చెప్పు. నువ్వంటే ఫరవాలేదనుకో. పోనీయ్ ఒక పని చేయరాదూ? అల్లుడికి మా ఇంట్లో ఎ.సి.రూమ్ ఏర్పాటు చేస్తాను.'

నా గుండె లావాలా ఉడికింది. మా బాబాయిని ఎడా పెడా వాయించేదాన్నే. కానీ అది స్టేషను-ఆయన స్టాఫ్ ముందు....క్షమించి వదిలేశాను.

'మీకు ఇంకా తెలీదేమోనండి మామయ్యగారూ. శైలును వదిలి నేనో క్షణం ఉండలేను. శైలు ఎక్కడుంటే అక్కడే నాస్వర్గం-ఆగదే నాకు ఎ.సి.రూమ్.'

ఆ మాటలతో బాబాయి సృష్టించిన లావాను అమృతంలా మార్చేశాడు వెంకటరమణమూర్తి.

'మంచి మాట చెప్పావు, అల్లుడూ. కానీ చూడు. ఒక మారిలా వస్తావూ? ఒక ముఖ్య విషయం అడిగిపోతాను.'

వెంకటరమణమూర్తి మళ్ళీ నావైపు చూచాడు. నాకు సిగ్గేసింది. కోపం వచ్చింది. అన్నయ్యను కసిరినట్లు కసరటానికి ఆయన పెద్దవాడు.

'రైలు స్టేషనులో రహస్యాలేంటి, బాబాయ్?'

అప్పటికి వూరుకున్నాడు. హైదరాబాద్ నిండా కార్లున్న బంధువులందరుండీ నాసామానుతో పాటు నేనూ టాక్సీ ఎక్కాను. ఆయన ఎక్కబోతున్నారు.

'చూడు, అల్లుడూ. నా మీద సి.బి.ఐ. ఎంక్వయిరీ ఉందని సిటీ అంతా మోగిపోతున్నది. ఎంత వరకు నిజమో నాకు తెలియదు. ఒక వేళ ఉన్నా నువ్వు తలచుకుంటే....'

ఆయన మాట్లాడకుండా హుందాగా టాక్సీలో కూర్చున్నాడు.

'పోనియ్' అన్నట్లు డ్రైవరుకు సౌంజ్ఞ చేశాడు.

అప్పటి వెంకటరమణమూర్తి నాకు చాలా కొత్త. నాకే భయమేసింది.

టాక్సీ కదులుతుంటే, డోర్‌కు, అటువైపు ఒకరు, ఇటువైపు ఒకరు నిలబడ్డ బాబాయి, అన్నయ్యలను

చూస్తుంటే నాకు ఆఫీసుల్లో ప్యూనులు గుర్తుకొచ్చారు.

టాక్సీ దిగి లోపలికి ప్రవేశించగానే మా కమలక్క మాసిన బట్టలతో, అలంకరణ లేని జుట్టుతో దరిద్రదేవతలా ఎదురైంది.

'రావే శైలూ. స్టేషనుకు రావటానికి పడలేదు. ఏమీ అనుకోకు సుమా.'

'అన్నయ్యగారు లేరా అండీ?' వెంకటరమణమూర్తే పలకరించాడు.

'పైసా ఉద్యోగం-రూపాయి పని అన్నట్లుంది, మరిదిగారూ మా పని. అందరిలాగా మంచి ఉద్యోగాలొచ్చే అదృష్టం ఆయనకు, అయ్యేయస్ ఆఫీసరు భార్య హోదా ననుభవంచే అదృష్టం నా మొహాన ఆ భగవంతుడు రాసి పెట్టలేదు. బానిస ఉద్యోగం ఆయనది. గాడిద చాకిరీ నాది. పొద్దుటే ఆఫీసుకు రమ్మని ఆర్డరు జారీ చేశాడట సెక్రటరీ. వెళ్ళక తప్పుతుందా?'

ఆ ధోరణి - అందులోనూ మేము వచ్చీరాగానే - నాకు నచ్చలేదు. ఇంతలో బాత్‌రూమ్‌లో, దొడ్లలో, పక్క ఇళ్ళలో ఉన్న పిల్లలు బిలబిలా నా చుట్టూ మూగారు. వాళ్ళ కని తెచ్చిన వస్తువుల్ని బయటికి లాగాను. మా అక్కయ్య దరిద్ర దేవత దండకాన్ని ఆపి నా స్తోత్రపాఠాన్ని లంకించుకుంది.

"ఎలాగైనా మా శైలజ గుణమే వేరు. లేకపోతే అంత పెద్ద ఆఫీసర్ మొగుడిని తీసుకుని ఈ నగరంలో ఇందరు గొప్ప గొప్ప ఆఫీసర్లు ఉంటే ఈ సెక్షన్ ఆఫీసర్ పెళ్ళాం ఇంటికి వస్తుందా?'

గ్రైండరు చూచి మరీ పొంగిపోయింది. 'నా కెందుకే గ్రైండరు? ఐ.ఎ.ఎస్. ఆఫీసరు భార్యనా? బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ భార్యనా? అందరికీ ప్రమోషన్లు వస్తుంటే మా ఆయనకు అసిస్టెంట్ సెక్రటరీ నుంచి సెక్షన్ ఆఫీసర్‌గా డిమోషన్ వచ్చిం దీమధ్యనే.'

అక్కయ్య అద్దెకుంటున్న ఇల్లు వాళ్ళకే ఇరుకు. అయినా రెండు రోజులు పిల్లలతో, మా వాళ్ళ కబుర్లతో సరదాగానే గడిచిపోయింది. అక్కయ్యకు వంటలో నేను సహాయం చేసేదాన్ని. ఆ రెండు రోజులూ వద్దనే కొద్దీ ఏవో శాకపాకాలు రుచి చూపించింది.

మా బావగారికి కాస్తంత వేదాంత ధోరణి, అస్ట్రాలజీ పిచ్చి, ఈమధ్య పట్టుకున్నట్లుంది. వెంకట రమణమూర్తి ఆయన్ని కదిపి ఈచర్చల్లోకి దించి కాలక్షేపం చేశాడు.

అయితే, గ్రైండరు కన్నా ముందే మేము పాత బడ్డట్టుంది. మూడో రోజు సాయంకాలం నుంచి మా అక్కయ్య ధోరణి మారింది. తన దారిద్ర్యాన్ని, తక్కువతనాన్ని అనుక్షణం ఆక్షేపించుకుంటూ చిరాకులు పడసాగింది.

ఆ రోజే మేము వూరి మీద పడ్డాం. బోలెడంత డబ్బు ఖర్చు. టాక్సీలలో అయిన వాళ్ళ ఇళ్ళను దర్శించి కాఫీ మర్యాదలు స్వీకరించాము.

'ఒక పూటన్నా మా ఇంట్లో భోజనం చేయాలి సుమా. ఆదివారం తప్పక రావాలి.'

ఒకపూట భోజనం కోసం మళ్ళీ టాక్సీఖర్చు. కాగా ఉండే ఒకటి రెండు ఆదివారాల్లో ఎందరి

ఇళ్ళకని వెళ్ళం?

ఉత్తరాల్లో జాలువారిన ప్రేమ ఏ ఒక్కరి ఇంటా నాకు లభ్యం కాలేదు. మైకపు పొరలు రోజులు గడిచే కొద్దీ విచ్చుకోసాగాయి.

ఆరో రోజు అక్కయ్య మంచం ఎక్కి ముసుగు తన్నింది. అన్నయ్య కాంప్ కెళ్ళాడు. బాబాయి, వెంకటరమణమూర్తి అభయంకోసం ఆరోజే కాంప్ నుంచి వూళ్ళోకి దిగి ఆయన చుట్టూ తిరగసాగాడు.

నా కిక అక్కడ ఉండటం విసుగేసింది. బంధువు పట్ల విరక్తి పుట్టింది. బాధను గుప్తంగా అనుభవించే కన్నా ఆయన ముందు తల వంచటమే నా కానందం.

'మనం ఢిల్లీకి వెళ్ళిపోదామండీ?'

అయన ఆశ్యర్యపోయినట్లు కనిపించలేదు.

'అదేం? అప్పుడేనా? ఇంకా ప్రోగ్రామ్‌లో చాలా ఉన్నాయి.'

'ఈ ఆరు రోజుల అనుభవం చాలు నాకు. నన్నుక్షమించు.......'

నా కళ్ళ వెంట నీళ్ళు తిరిగాయి. ఆయన గుండె మీద వాలి ఏడిస్తే కాని ఆ అవమానాల భారం తీరలేదు.

'నువ్వు గనుక ఇన్నిరోజులు భరించావ్. మీ అక్కయ్య గొప్పది కనుక ఆరు రోజులు అంత మాత్రం ఆతిథ్యమిచ్చింది. అంత వరకూ నా ఊహ తల్లక్రిందులయింది. నువ్వు గెలిచావు, శైలూ' నన్ను దగ్గరికి తీసుకుని వూరడించాడు నా భర్త - ప్రియ భర్త - వెంకట రమణమూర్తి.

'ఢిల్లీ వెళ్ళిపోదాం మరి. రేపటికే టిక్కెట్లు సంపాదించండి. ఫస్టుక్లాసు దొరక్కపోతే సెకండుక్లాసు, ఎలాగైనా సరే.....

'నువ్వొట్టి పిచ్చి పిల్లవు శైలూ. పరమ అమాయకురాలివి. నీ గుండెలో ప్రేమ తప్ప కాలుష్యం లేదు. కానీ, ఇలా అర్థాంతరంగా మిగతా ప్రోగ్రామ్ కాన్సిల్ చేసుకునిపోతే నలుగురూ నింద నీమీద వేస్తారు. పైగా ఢిల్లీలో వాళ్ళకు ఏం సంజాయిషి ఇచ్చుకుంటావ్?'

'అయితే, ఏమంటారు? ఈ నరకయాతన అనుభవించక తప్పదంటారా?'

అసలు రహస్యం అప్పుడే చెప్పాడు. కార్యక్రమం రీషెడ్యూలు చేశాడు. ప్రోగ్రామ్ ప్రకారం అందరినీ చూస్తాము. అయితే కాలాల్లోనే మార్పు. బిజీ కార్యక్రమంతయారయింది. ఎవరింటా రెండు గంటలు మించి ఉండే వ్యవధి లేదు. ఒక్కమా పుట్టింటికి మాత్రం ఒక పూట కేటాయించాడు.

'ఎవరి ఇంటికి పోయినా వ్యవధి లేనట్లు నటించాలి. అప్పుడు వాళ్ళుమరో వారం అన్నా ఉండకుండా పోతున్నారా? అని మర్యాదలు చేస్తారు. విచారాలు వ్యక్తం చేస్తారు.

"ఈ తడవ వచ్చినప్పుడు ఉంటాంగా? ఈ సారికి క్షమించాలి మీరు. మొదట్లో ఉందామనే అనుకున్నాం. కానీ పరిస్థితులు అలా వచ్చాయి. ఢిల్లీకి అర్జంటుగా వెళ్ళిపోవాలి" అని చెప్పుకుంటూ

పోవాలి. అప్పుడు మన స్టేటస్ పెరుగుతుంది. నువ్వు ఆశించిన ప్రేమ వారి నుంచి అభ్యమవుతుంది.-

'అలాగైనా మనం ఢిల్లీకి ముందే వెళ్ళాల్సి ఉంటుందిగా? అక్కడి వాళ్ళకు సంజాయిషి మాటేమిటి?' నా అనుమానం.

'అదే పొరపాటు. మనం ఢిల్లీకి అసలు కార్యక్రమం ప్రకారమే వెళ్తాం. కార్యక్రమం రీ షెడ్యూలు వల్ల మిగిలిపోయే నెల పై చిలుకు కాలాన్ని తీర్థయాత్ర ప్లస్, హనీమూన్‌గా తిరుపతి, మహానంది, శ్రీశైలం ఇత్యాది పుణ్య క్షేత్రాలలో రహస్యంగా - హాయిగా గడిపేద్దాం. అటు ముక్తి, ఇటు రక్తి. ఏమంటావ్?

ఎక్సలెంట్ అయిడియా? కాదనగలశక్తి ఎవరికుంది? ఆనందాతిశయంతో వెంకటరమణమూర్తి బుగ్గల్ని కొరికేయా లనిపించింది.

'నిజానికి నా వెంకటరమణమూర్తి నా సన్నిధిలో ఉండగా వేరే వెంకటరమణమూర్తి కోసం నేను ఎక్కడికీ వెళ్ళాల్సిన అవసరం లేదు డియర్. ఇక నేను బంధువుల్ని భగవంతులని ఈ ప్రత్యక్ష వెంకటరమణమూర్తి లోనే చూచి తరిస్తాను' ఆయనలో ఐక్యం చెందుతూ ఆనందానుభూతితో నాలో నేను గొణుక్కున్నాను!

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక - 23-8-1978